# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఇంధన సరఫరాకు కీలకమైన పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ఈ క్లిష్ట సమయంలో ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- సకాలంలో న్యాయం పొందడం ప్రతిపౌరుడి ప్రాథమిక హక్కు అని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ తెలిపారు.
- అసోంలోకి అక్రమ చొరబాట్లను బీజేపీ అడ్డుకుందని, రానున్న ఐదేళ్లలో వారందరినీ వెనక్కి పంపుతామని కేంద్రమంత్రి అమిత్ షా వెల్లడించారు.
- పెట్రోల్ బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

వేసవి నేపథ్యంలో జల సంరక్షణపై ప్రజలు దృష్టి పెట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. ఆకాశవాణి ద్వారా “మన్ కీ బాత్” కార్యక్రమం 132వ సంచికలో ఈరోజు ఆయన దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముదిగుంట గ్రామాన్ని ఆయన ప్రశంసించారు. ఆ గ్రామంలోని 400 కుటుంబాలు ఇంకుడు గుంతలు నిర్మించుకుని భూగర్భ జలమట్టాన్ని పెంచడమే కాకుండా.. కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను తగ్గించుకున్నాయని ఉదహరించారు. టీ-20 ప్రపంచ కప్‌లో విజయం సాధించిన భారత్ జట్టును, రంజీ ట్రోఫీని కైవసం చేసుకున్న జమ్మూ కాశ్మీర్ జట్టును అభినందించారు. అలాగే న్యూయార్క్ హాఫ్ మారథాన్‌లో రికార్డు సృష్టించిన గుల్వీర్ సింగ్, స్క్వాష్‌లో సత్తా చాటుతున్న 17 ఏళ్ల అనాహత్ సింగ్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశంలోని రాతప్రతులు, సాంస్కృతిక సంపదను కాపాడుకునేందుకు “జ్ఞాన భారతం” సర్వేను ప్రారంభించినట్లు నరేంద్ర మోదీ తెలిపారు. జూన్ మధ్య వరకు సాగే ఈ సర్వేలో “జ్ఞాన భారతం” యాప్ ద్వారా ప్రజలు భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఇంధన సరఫరాకు కీలకమైన పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున.. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సంక్షోభం తలెత్తిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన "మన్ కీ బాత్" కార్యక్రమంలో ఆయన ఈరోజు దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఈ ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేసే ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులకు సాయం అందిస్తున్న ఆయా ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశ నిర్మాణంలో "మై భారత్" (MY Bharat) సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని ప్రశంసించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 100 రోజుల సమయం ఉందని.. ప్రతిరోజు యోగా చేయాలని ప్రజలకు సూచించారు. ఆహారంలో చక్కెర వాడకాన్ని తగ్గించాలని, వంట నూనె వినియోగాన్ని 10 శాతం మేర తగ్గించుకోవడం ద్వారా ఊబకాయం, జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నరేంద్ర మోదీ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

అసోంలోకి అక్రమ చొరబాట్లను బీజేపీ అడ్డుకుందని, రానున్న ఐదేళ్లలో వారందరినీ వెనక్కి పంపేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం మంత్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత అమిత్ షా ప్రకటించారు. సోనిత్‌పూర్ జిల్లా ధేకియాజులిలో ఈరోజు జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అసోం తిరుగుబాటు రహిత రాష్ట్రంగా మారిందని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో అనేక శాంతి ఒప్పందాలు జరిగాయని, దీనివల్ల ఈ ప్రాంతంలో స్థిరత్వం ఏర్పడి.. అభివృద్ధి సాధిస్తోందని వివరించారు. బీజేపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన అసోం రూపురేఖలను మార్చేశాయని అమిత్ షా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న కోటి మంది భారతీయుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు పాలక్కాడ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను భారత్ నిరంతరం గమనిస్తోందని, ఆ దేశాల నేతలతో తాను స్వయంగా సంప్రదింపులు జరుపుతున్నానని వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయుల భద్రతను పణంగా పెట్టి.. రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు కేరళం అభివృద్ధి పట్ల ఎలాంటి శ్రద్ధ చూపలేదన్నారు. కేవలం బీజేపీ-ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బహిరంగ సభ అనంతరం ప్రధానమంత్రి త్రిశూర్ చేరుకుని రోడ్‌షోలో పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని అన్ని పెట్రోల్ బంకుల్లోనూ సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలను ఖండించింది. వినియోగదారులకు ఊరట నిచ్చేలా పెట్రోల్, డీజిల్ ధరలపై లీటరుకు 10

రూపాయల చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినట్లు వెల్లడించింది. అలాగే దేశీయంగా కొరత లేకుండా విమాన ఇంధనం (ATF) ఎగుమతులపై సుంకాన్ని విధించినట్లు పేర్కొంది. వంట గ్యాస్ (LPG) సరఫరా సాధారణంగానే ఉందని... రోజుకు 55 లక్షలకు పైగా సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. యూరియా ప్లాంట్లకు కూడా గ్యాస్ సరఫరా స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో ఉన్న భారతీయ నౌకలు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది. 94 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో రెండు నౌకలు భారత్ కు వస్తున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు సుమారు 5 లక్షల 24 వేల మంది భారతీయులు పశ్చిమాసియా నుండి స్వదేశానికి తిరిగి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ఆధునీకరించిన ప్రజా సౌకర్యాలను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈరోజు జాతికి అంకితం చేశారు. వీటిలో ఉడాన్ యాత్రి కేఫ్, డిజీ యాత్ర వ్యవస్థలు, ఉచిత వై-ఫై జోన్లు, మౌలిక సదుపాయాల మెరుగుదల ప్రాజెక్టులు ఉన్నాయి. రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా కేంద్రమంత్రి మాట్లాడుతూ... హైవేలు, రైల్వేలు, ఓడరేవులతో పాటు పౌర విమానయాన రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 2014లో దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు ఉండగా... నేడు ఆ సంఖ్య 165కు చేరిందని, రాబోయే కాలంలో దీనిని 350కి పెంచడమే లక్ష్యమని ఆయన వివరించారు. అనంతరం గుజరాత్‌లోని భావ్‌నగర్ విమానాశ్రయం నుంచి నవీ ముంబయికి మొదటి విమాన సర్వీసును మంత్రి రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆఫ్రికా దేశమైన కామెరూన్‌లో నివసిస్తున్న భారత సంతతి ప్రజలు ఇరు దేశాల మధ్య బలమైన వారధిలా నిలుస్తున్నారని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కొనియాడారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) 14వ మంత్రివర్గ స్థాయి సదస్సులో పాల్గొనేందుకు ఆయన కామెరూన్ వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భారతీయ సమాజం ఆత్మీయ సమ్మేళనంలో కేంద్రమంత్రి ప్రసంగించారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

సకాలంలో న్యాయం పొందడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ తెలిపారు. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ "దిశ" (DISHA) పథకం కింద నిర్వహించిన "టెలీ-లా" కార్యక్రమం జాతీయ స్థాయి సదస్సులో ఆయన ఈరోజు ప్రసంగించారు. బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్, సురక్ష సంహిత వంటి కొత్త చట్టాలు దేశ చరిత్రలో ఒక మైలురాయి అని కొనియాడారు. క్లిష్టమైన ప్రక్రియలను సరళతరం చేయడం, జాప్యాన్ని తగ్గించడం, జవాబుదారీతనాన్ని పెంచడం ద్వారా న్యాయాన్ని ప్రజల వద్దకు ఈ సంస్కరణలు తీసుకువచ్చాయని ఉపరాష్ట్రపతి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ మేరకు జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ సహా పశ్చిమ రాజస్థాన్‌లకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. తెలంగాణ, కర్ణాటక సహా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రేపటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ లో భాగంగా ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబయి ఇండియన్స్ తలపడుతున్నాయి. టాస్ గెలిచిన ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా నైట్ రైడర్స్ 12 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 136 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =